
క్లుప్తంగా

నేడు మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు



మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ జూన్ 6వ తేదీన జరగనున్న సందర్భంగా మంగళవారం అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు ఊరేగింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకు జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం కోట బయట సతకంపట్టు వద్ద కొలువు ఏర్పాటు చేస్తారన్నారు. నెల రోజులు కొలువు అనంతరం తిరిగి ఆలయానికి ఘటాలు చేర్చడంతో అమ్మవారి పండగ పూర్తవుతుందన్నారు. కమిటీ సభ్యులతోపాటు భక్తులు పాల్గొనాలని కోరారు.

నాడు - నేడు పనులపై పర్యవేక్షణ



నాణ్యతపై వివరాలు తెలుసుకుంటున్న నర్సింహులు, శేషుబాబు

రావికమతం: తట్టబంద శివారు బూరుగుపాలెం పాఠశాలలో రూ.20 లక్షలతో చేపడుతున్న భవన నిర్మాణ పనులను ఎంపీటీసీ శేషుబాబు, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితత్వంతో ఉండాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని ఈ సందర్భంగా హెచ్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, రమేష్‌లకు సూచించారు.

మండలానికి 45 గోశాల షెడ్లు మంజూరు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: మండలానికి 45 గోశాల షెడ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ షెడ్లు నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టరు లక్ష్యాన్ని విధించారన్నారు. రైతు తాలుకా పశువులను బట్టి షెడ్డు ఒక్కంటికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు. షెడ్ల పనులు చేసిన రైతులకు ఆన్‌లైన్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో చిన్నారావు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మృతికి ఘన నివాళి



సంతాపం తెలుపుతున్న యువకులు, నాయకులు

బుచ్చెయ్యపేట: ఢిల్లీలో వీరమరణం పొందిన చీడికాడ మండలం దిబ్బపాలెంకు చెందిన ఆర్మీ జవాన్ మహేష్ ఆత్మకు శాంతి కలగాలని అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రార్థించారు. సోమవారం వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌లో 650 మంది విద్యార్థులు, నాయకులతో కలిసి అమరవీరుడు మహేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అతడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

సబ్సిడీపై మిశ్రమ దాణా

మాడుగుల: రైతు భరోసా కేంద్రాల్లో సంపూర్ణ మిశ్రమ దాణా 60 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉందని మాడుగుల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో పాల దిగుబడి పెంచడానికి ఈ దాణా ఉపయోగపడుతుందన్నారు. కేజీ రూ 15.90 పైసలు కాగా, 60 శాతం సబ్సిడీపై రూ.9.40 పైసలు పోగా, రైతుకు రూ.6.50 పైసలకు వస్తుందన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

‘ప్రత్యేక’ శ్రద్ధ

- ఇంటర్ తప్పిన విద్యార్థులకు మరో అవకాశం
- ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- 21 రోజుల పాటు శిక్షణ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం: విద్యా విధానంలో ఎప్పటికప్పుడు సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు సువర్ణావకాశం కల్పించింది. వీరు ప్రైవేటు క్లాసులకు వెళ్లి చదువుకోవాలంటే ఆర్థిక భారం కావడంతో ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా ఇంటర్ బోర్డు ఉత్తర్వుల మేరకు అధ్యాపకులు బోధిస్తున్నారు. వీరు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నారు.

- ఒకటి నుంచి మూడు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా శాఖాధికారులు దృష్టి సారించారు. సబ్జెక్టుల వారీగా అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులు అంతంత మాత్రంగా వస్తుండటంతో అధ్యాపకులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలలకు పంపాలని కోరుతున్నారు. 21 రోజుల పాటు అందించే శిక్షణ ద్వారా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు.

– నియోజకవర్గంలో నర్సీపట్నంలో మూడు కళాశాలలు, కె.డి.పేట, మాకవరపాలెంలో ఒక్కొక్క కళాశాల ఉన్నాయి. అన్ని గ్రూపులకు సంబంధించి మొదటి ఏడాది పరీక్షకు హాజరైన 584 మందిలో 180 ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది పరీక్షలకు 576 మంది హాజరు కాగా 292 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతుల ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు.

పాస్ కాలేదనే ఆందోళన వద్దు...



పరీక్షల్లో పాస్ కాకపోవటంపై ఆందోళన వద్దు. విజయం సాధించడానికి ప్రభుత్వం మరోక అవకాశం కల్పించింది. ఉత్తీర్ణత సాధించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోండి. ఉత్తీర్ణత శాతం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జి.చిన్నారావు,
ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, నర్సీపట్నం

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం

- వేచలం సచివాలయంలో రూ. 8.04 కోట్ల మేర సంక్షేమ లబ్ధి
- ‘గడప గడపకు’ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అరుగుపై కూర్చొని వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వేచలం సచివాలయం పరిధిలో సోమవారం ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శివారు కల్లాల్లో కుటుంబాల వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి మరీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కొద్దిసేపు చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వేచలం సచివాలయం పరిధిలో 2,703 మంది లబ్ధిదారులకు రూ. 8.04 కోట్ల మేర సంక్షేమ లబ్ధిని అందజేశామన్నారు. జల జీవన్ మిషన్ స్కీమ్‌లో రూ. 1.55 కోట్లతో ప్రతీ ఇంటికి కుళాయి నీరుతోపాటు 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన అదనపు మంచినీటి ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. శివారు కల్లాల్లో మరో 10 వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలో 43 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశామన్నారు. గ్రామ అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వేచలపు చిన్నంనాయుడు, వేచలపు కుమార్, వంటాకు సింహాద్రప్పడు, వేచలపు సూరిబాబు, వేచలపు కృష్ణ, కర్రి కొండబాబు, బత్తినాయుడు, వేచలపు గంగాధర్ బుజ్జి, కొత్తపెంట, ఎం.అలమండ సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాద్ పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



రమణమ్మకు నగదును అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు: గుల్లేపల్లికి చెందిన చుక్క పైడంనాయుడు భార్య రమణమ్మకు తక్షణ సాయంగా సర్పంచ్ బండారు దేముళ్లు సోమవారం రూ.10 వేలు అందించారు. ఈ నెల 4న సహజ మరణం చెందిన పైడంనాయుడు వైఎస్సార్ బీమా లబ్ధిదారు కావడంతో లక్ష రుపాయల మంజూరైంది. ఇందులో భాగంగా మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ కానున్నట్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆకస్మిక మృతి



పద్మావతి (ఫైల్)

రావికమతం: టి.అర్జాపురం అంగన్‌వాడీ కార్యకర్త కసా పద్మావతి(53) సోమవారం సాయంత్రం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడంతో ఆమెను బంధువులు విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆమెకు భర్త పిల్లలు ఉన్నారు.

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 42 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్ పరిధిలోని 12 మండలాల నుంచి భూ సమస్యలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, సదరం సర్టిఫికెట్లు తదితర సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. ఒకే సమస్యపై పదే పదే స్పందనకు రాకుండా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకుని పరిష్కరించాలన్నారు. పరిష్కరించడానికి వీలుపడలేనప్పుడు సంబంధిత కారణాన్ని బాధితుడికి లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



సీతారాములకు పూజలు చేసుకుంటున్న భక్తులు

రోలుగుంట: కొండపాలెంలో సీతారాముల ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున తరలివచ్చి సీతారాములను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ బంటు లక్ష్మి, ఉప సర్పంచ్ చిరంజీవి, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు దంపతులతో ఆలయ అర్చకుడు శర్మ అభిషేకాలు చేయించారు. గ్రామస్తుల సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానికులతోపాటు రోలుగుంట, వెలంకాయలపాలెం తదితర గ్రామాల భక్తులు ప్రసాదం స్వీకరించారు.

సొసైటీ సభ్య కుటుంబాలకు బీమా సాయం



బీమా చెక్కులను అందచేస్తున్న సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు

చోడవరం రూరల్: లక్కవరం ప్రాథమిక సహకార సంఘం సభ్యుల కుటుంబాలకు బీమా సహాయ చెక్కులను సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసరాజు సోమవారం అందజేశారు. సంఘ సభ్యులైన శీరం రెడ్డి అప్పలనాయుడు, బండారు దేముడమ్మ, లక్కవరపు పెంటయ్య, వేపాడ లక్ష్మణ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందారు. వీరికి జనరల్ ఇన్సూరెన్సు కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను మృతుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కె.రాము, కె.ఆదినారాయణ, సంఘం సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



మాడుగులలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ కళావతి



కొత్తకోటలో మాట్లాడుతున్న నూకరాజు మాస్టారు



వడ్డాదిలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



చౌడువాడ గ్రంథాలయంలో హాజరైన విద్యార్థులతో పద్మావతి

రావికమతం/బుచ్చెయ్యపేట/మాడుగుల/మాకవరపాలెం/కె.కోటపాడు: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 11వ తేదీ వరకు కొనసాగే ఈ శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు కథలు, పుస్తకపఠనం, చిత్రలేఖనం, పుస్తక సమీక్ష, తదితర పోటీలు నిర్వహించి వారితో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీస్తారు. ఈ మేరకు మాడుగుల శాఖా గ్రంథాలయంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి వేసవి శిబిరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనువాసరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.నాయుడు, గ్రంథాలయాధికారి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- రావికమతం మండలం కొత్తకోట శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు వరహామణి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బేతా నూకరాజు వేసవి శిబిరాన్ని ప్రారంభించారు.
- బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో గ్రంథపాలకుడు వెంకటేశ్వర్లు విద్యార్థులతో వేసవి విజ్ఞాన శిబిరం గోడపత్రికలతో ప్రచారం చేయించారు.
- మాకవరపాలెంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సర్పంచ్ అల్లంపల్లి శిరీష ప్రారంభించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు, గ్రంథాలయ అధికారి చంద్రకళ పాల్గొన్నారు.
- కె.కోటపాడు మండలం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి ప్రారంభించారు.

‘కనీస వేతనం అమలు చేయాలి’

అనకాపల్లి టౌన్ : జోన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ క్లాప్ డ్రైవర్లకు(కాంట్రాక్టు) కనీస వేతనం రూ.18,500లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక జోన్ కార్యాలయం డంపింగ్ యార్డు వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు అందరినీ ఆప్కాస్‌లో కలపాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని, హెల్త్ కార్డు అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వాలని, జీవో నెం.7 అమలు తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకని ఎడల ఈ నెల 15న సమ్మెకు దిగనున్నట్టు హెచ్చరించారు. ధర్నాలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జోన్ అధ్యక్షుడు ఎ.జె.శివకుమార్, కార్యదర్శి పి.సతీష్ కుమార్, కోశాధికారి కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



దామునాపల్లిలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దామునాపల్లిలో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వివిధ కారణాలతో పింఛన్లు పొందలేని కొంతమంది తమ గోడు వెళ్లబోసుకున్నారు. త్వరలో వారికి పింఛన్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మరికొంతమంది ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామంలో ఏ సమస్యా ఉన్న తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వీఆర్వోలపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: రైతుల రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. పట్టాదారు పాసు పుస్తకాలు, రెవెన్యూ పరమైన సమస్యలపై ఆన్‌లైన్ చేసుకుంటే నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలన్నారు. కొన్ని గ్రామాల్లో వీఆర్వోల పనితీరుపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, మార్పు రాకపోతే తదుపరి తీసుకునే చర్యలకు బాధ్యలవుతారన్నారు. రీసర్వే చేసేటప్పుడు రైతులు సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ప్రతి ఓటరుకు ఆధార్ నంబరు అనుసంధానం చేయాలన్నారు. అర్హత ఉన్న వారిని కొత్త ఓటరుగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణ కాకుండా నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, మండల సర్వేయరు బాలరెడ్డి, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మాకవరపాలెం: ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా డ్వాక్రా మహిళలు ముందుకు సాగాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ సూచించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఆదాయం వచ్చే వాటిపై డ్వాక్రా మహిళలు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. రుణాల మంజూరు, రికవరీపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా ఎప్పటికప్పుడు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. దీంతోపాటు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీనిధి, కల్యాణమస్తు, ఇతర రుణాలపై తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చినబాబు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఏడువాక

చోడవరం: ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో గోవాడ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 500పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతోపాటు విద్యా ప్రమాణాలు చాలా మెరుగుపడ్డాయని చైర్మన్ సత్యారావు అన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే మంచి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పాలిమేర దేముళ్లు, ప్రధానోపాధ్యాయుడు కె.రాము, వైస్ చైర్మన్ గంటా సత్తిబాబు, వార్డు మెంబర్లు మజ్జి ఆనంద్, నక్కా శ్రీను పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ప్రతిభకు సత్కారం

- హోంగార్డు కుమార్తె తక్షశిల ఐఏఎస్ అకాడమికి, రూ.90 వేల స్కాలర్‌షిప్‌కు ఎంపిక



సౌమ్యను సత్కరించిన కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్



జాహ్నవిని అభినందిస్తున్న సీఐ దంపతులు, కొత్తకోట పోలీసులు

రావికమతం: కొత్తకోట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు దంపతుల కుమార్తె జాహ్నవి పదో తరగతి ఫలితాల్లో 489 మార్కులు సాధించింది. తక్షశిల ఐఏఎస్ అకాడమిలో ఇంటర్ సీటు దక్కించుకుంది. ఏడాదికి రూ.90 వేల స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా సదరు విద్యార్థినిని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, మున్ని దంపతులతోపాటు ఎస్ఐ విభీషణరావు, సిబ్బంది సోమవారం రాత్రి అభినందించారు. హోంగార్డులు కొర్రా అప్పారావు, ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె జాహ్నవి మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపింది. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ దీవించారు.

రోలుగుంట: హెడ్ కానిస్టేబుల్ సురేష్ కుమార్ కుమార్తె సౌమ్య ఇటీవల పదో తరగతిలో 522 మార్కులు సాధించింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకు ప్రతిభ చూపడంతో కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై నాగకార్తీక్‌తో కలసి సత్కరించారు. ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: సారా విక్రయిస్తున్న కొమిర గ్రామానికి చెందిన కొర్రా అప్పారావును అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆ గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో పోలీసు సిబ్బంది దాడి చేయగా అప్పారావు పట్టుబడ్డాడని పేర్కొన్నారు. నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

